దెయ్యాల కథలు చెప్పి భయపెట్టే అతను చెప్పిన అసలు కథ!

# గిలి

మండల రామారావు కథ

దాసు నాకు ఓ కథ చెప్పాడు. దాసు అంటే నిత్యమూ హరినామ సంకీర్తన చేసేహరిదాసుకాదు. మద్యపాన ప్రియుడైన దేవదాసూకాదు. ఉపమాకాళిదాసస్య అని పేరుపొందిన కాళిదాసూ కాదు. అతడు వెంకటదాసు. నా బాల్యమిత్రుడు. మంచాలవారి అబ్బాయి. రిటైర్డ్ రైల్వే స్టేషన్ మాస్టరు. అడిగినదే తడవుగా తన అనుభవాలను అందరికీ అందించి ఆనందింపజేసే సజ్జనుడు.

అతను చెప్పినదేదైనా నేను నమ్ముతాను. ఎందుకంటే అతని మాటలు నీటిమూటలు కావు. నిత్యసత్యాలు. మనిషి ఆలోచనను రేకెత్తించే నగ్నసత్యాలు అతని ముఖతా వెలువడతాయి. సాహిత్య సార్వస్వత రంగాలమీద అతనికి పట్టు వుంది. షిరిడీ సాయిబాబామొదలు పుట్టపర్తిసాయిబాబా మహత్యాలవరకు చెప్పి నమ్మించగల దిట్ట. రామాయణ కల్పవృక్షానికీ, రామాయణ విషవృక్షానికీ, భారతానికీ అలాగే గీరతానికి భావగర్భితమైన భాష్యం చెప్పగల సర్వ సమర్థుడు. అందుకే అతని మేధస్సుకు జోహారులర్పించుకుంటూ వుంటాను.

అతను ఏది చెప్పినా నమ్మే నేను ఆనాడు అతను చెప్పిన కథను నమ్మలేకపోయి కట్టుకథగా కొట్టిపారవేసినాను.

అతను మిత్రుడు కరుణాకర్‌కు ఎవరన్నా భయంలేదట. ఆంబోతైనా తాగుబోతైనా, పిచ్చివాడైనా, రౌడీ అయినా భయపడడట. దైవమన్నా, దయ్యమన్నా అసలు నమ్మకంలేదట. ఇద్దరూ ఆఖరి బస్సులో దిగి నిశిరాత్రిలో వారి గ్రామానికి కలిసి వెళ్తున్నారట.

కబుర్లూ కాకరకాయలూ చెప్పుకుంటూ



వెళుతూ ''నాకల్లా ఒక పోలీసు కానిస్టేబుల్ అంటే తప్ప ఎవరన్నా భయంలేదు'' అని తన బలహీనతను ఆఖరిమాటగా చాటుకున్నాడట మిత్రుడు. అలా మాటలు చెప్పుకుంటూ ఫర్లాంగు దూరం వెళ్లేసరికి ఒక చెట్టుమీద నుండి కానిస్టేబుల్ వారి ముందుకు దూకాడట. అంతే! ఆ మిత్రుడు గుండె పగిలి అక్కడికక్కడే మరణించాడట. ఏమిటంటే దయ్యమే

కానిస్టేబుల్‌గా మారి చెట్టుమీదనుండి క్రిందికి దూకిందట. కొద్దిసేపటికి ఆ కానిస్టేబుల్‌కూడా అదృశ్యమైనాడట. దాసు చెప్పుకుపోతున్నాడు.

''ఇదిగో దాసూ! ఇలాంటి కట్టుకథలు నాకు చెప్పకు. ఏ వీక్ మైండెడ్ పర్సన్‌కో చెప్పు'' అంటూ దాసును అవహేళన చేశాను. దాసు అబద్ధాలాడడని తెలుసు. అయినా అతను ఎందుకు ఇలా రాంగ్‌ట్రాక్‌లో పడినాడో నాకర్థంకాలేదు.

ఇంటికి వచ్చి దీర్ఘంగా ఆలోచించాను. ఒక్కొక్కరికి ఒక్కొక్క బలహీనత వుండవచ్చును. మా కరణంగారికి ఉరుము అంటే భయం. పరాత్పరరావుకు పిడుగు అంటే పిరికి. మోహనరావుకు మొండిగోడలంటే అసహ్యం. పెద్దిరాజులుకు పెళ్లామంటే హడల్. ఈ రకమైన కాంప్లెక్స్ క్రియేట్ చేసుకున్న మనుషులలో కానిస్టేబిల్ అంటే భయం ఏర్పరచుకున్న వ్యక్తిగా కరుణాకర్‌ను నేను చిత్రీకరించుకున్నాను. దయ్యం అలా కానిస్టేబిల్ రూపంలో చెట్టుమీదనుండి దూకడం నేను దాసుతో ససేమిరా ఏకీభవించలేదు.

''మిత్రమా! ఈరోజైనా దయ్యాల కథలు మాని నీ ముప్పదేళ్ల సర్వీసులోని రైలు అనుభవాలు, అనుభూతులను చెప్పు'' అని మరునాడు దాసును రిక్వెస్టు చేశాను.

అతను చెప్పడానికై ఉపక్రమించాడు. ''మనుషులను తినే పులి ఒకటి కొండల మధ్యలోనుండి వెళ్లే రైలుమార్గంలో రైల్వేట్రాక్ పక్కన ఒక మనిషిని చంపి మొండాన్ని ఎత్తుకుపోయి అతని తలమాత్రం అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయిందట. దానిని కనిపెట్టి ఒక పులుల వేటగాడు మరునాడు ఆ రైల్వేట్రాక్కు ఇరవై గజాల దూరంలో ఒక పొద చాటున మాటువేసుకుని ఆ పులి రెండవసారి రాకకై తుపాకి ఎక్కుపెట్టుకుని కళ్లు ఆర్పకుండా చూస్తూ కూర్చున్నాడట. అయితే కనుగుడ్లు భయంకరంగా తెరుచుకుని వున్న మొండెంలేని ఆ మనిషి తల వేటగానివైపుకు దొర్లుకుంటూ వస్తుందట. అడవుల్లో ధైర్యంగా తిరుగుతూ దాదాపు ఇరవై పులులను చంపిన ఆ వేటగానికి ఆ విపరీత సంఘటన చూచి గుండె బలహీనపడి వణుకు పుట్టిందట'' అంటూ కథ చెప్పడం ఆపాడు దాసు.

''దాసూ! దిస్ ఈజ్ అన్ బిలీవబుల్. అదీ నమ్మను'' అని నిష్కర్షగా చెప్పాను నేను. ఎందుకో అతని మాటలమీద నాకు నెమ్మది నెమ్మదిగా నమ్మకం సడలుతుంది.

వెంటనే నన్ను తన ఇంటికి తీసుకువెళ్లి ఒక పుస్తకంలో వ్రాయబడిన ఆ వేటగాని అనుభవం చూపించాడు. ''ఆ మనిషి తలను రెండు పెద్ద పేడ పురుగులు నావైపుకు దొర్లించుకుంటూ వచ్చాయి. అది దయ్యమని భ్రమపడి భయపడ్డాను'' అని నిర్దుష్టంగా అందులో విశదీకరించాడు ఆ వేటగాడు - రచయిత.

''దాసూ ఇప్పుడు ఇది నేనునమ్ముతాను. దయ్యంగా మారి అక్కడ ఉన్న తల నడచిరావడం అసంభవం. అందుకే నేను మొదట నమ్మనన్నాను'' అన్నాను నేను.

ఏది ఏమైనా దాసు మాటలమీద నాకు ఇంకా శ్రద్ధాసక్తులువున్నాయి.

''సరే నమ్ము, నమ్మకపో! శరీరం గగుర్పాటు చెందే నాకు తెలిసిన మరో కథ నీకు చెప్పక తప్పదు'' అన్నాడు దాసు. నేను నోరు తెరుచుకుని చెవులు రిక్కించుకుని వింటున్నాను.

ఓ రోజున బందరులో అర్ధరాత్రి రైలుదిగా నోబుల్ కాలేజీ సందునుండి ప్రయాణికుడు ఒంటరిగా నడుస్తూ వస్తున్నాడట. ఇంతలో ఓ మనిషి అకస్మాత్తుగా వెనకాల వచ్చి ''ఏమండీ ఎందాక వెళ్తున్నారు! ఒక్కరే వెళ్తున్నారు భయంలేదా?'' అని అడిగాడట. ''నక్కలతోట'' అని మొదటి వ్యక్తిసమాధానం చెప్పాడట. ''నేనూ అక్కడికే వస్తున్నాను. జతగా వెళ్దాము'' అన్నాడట వెనుకనున్న వ్యక్తి. ఒకరి వెనుక ఒకరు నడుస్తూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ముందుకు నడుస్తూ నక్కలతోటలోని మొదటి వ్యక్తి ఇంటి సమీపాన మూల వంపున ఓ సమాధి ప్రక్కకురాగానే ''నిలబడండి. నిలబడడండి'' అని వెనకాల వ్యక్తి అన్నాడట. ముందు మనిషి ఆగాడట. ''చూడండి! ఈ సమాధివద్దనేనండి నన్ను మర్డర్ చేసింది'' అని వెనుకనున్న వ్యక్తి అన్నాడట. మొదటి వ్యక్తి వెనుదిరిగి చూసేసరికి రెండో మనిషి అదృశ్యమైనాడట. మొదటి మనిషి నూరుగజాల దూరంలో వున్న తన ఇంటికి రొప్పుకుంటూ రోజుకుంటూ పరుగెత్తుకుని వచ్చి కుటుంబ సభ్యులతో ఈ భయంకరమైన సంఘటనను చెపుతూ రక్తం కక్కుకుంటున్నాడట. అతనిని ఆస్పత్రికి తీసుకొని వెళ్లే లోపున అంతా అయిపోయిందట.

''ఇది అసత్యం - అసంభవం - అసంగతం - అభూత కల్పన - భూత ప్రేత పిశాచాలను నేను నమ్మనుగాక నమ్మను. ఇలాంటి కథలు ఏ చెవిలో పూవు పెట్టుకున్నవానికో, ఏ నోట్లో వేలు పెట్టుకున్నవానికో చెప్పు దాసూ! నాకు కాదు'' అన్నాను నేను. ఈసారి వెంకటదాసుమీద నాకు ఏహ్యాభావం ఏర్పడింది. విజ్ఞానరంగం ఎంతో ఎత్తుకు ఎదిగిన ఈ రోజుల్లోకూడా దయ్యాల కథలకు దాసోహమంటూ చెప్పుకుంటూ పోతున్న దాసు అజ్ఞాన తిమిరాన్ని తలచుకుంటూంటే అతనియెడల నాకు జాలి జనించింది.

ఇద్దరం విడిపోయాం. దాసుమీద నాకు మునుపటి నమ్మకం లేనేలేదు. అతనిమీద

## మాట

''ఏంటోయ్ బాగున్నావా?''

''బాగున్నానండి''

''ఇప్పుడేం చేస్తున్నావోయ్?''

''ఓ తల తిక్క ముసలాడితో మాట్లాడుతున్నా''

- షరీఫ్ అహ్మద్ (ఇల్లంతకుంట)



న్యూనతాభావం కూడా ఏర్పడింది.

నా దారిన నేను బందరులో బ్రతుకుతున్నాను. దాసుకు శృంగవరపు కోటకు ఉత్తరాలు వ్రాయడంకూడా మానివేశాను.

కొంతకాలం తర్వాత గుడివాడ విద్యా వికాస్ కాన్వెంట్ వార్షికోత్సవానికి అతిథిగా హాజరై కరస్పాండెంట్ సుబ్బారావుగారివద్ద శలవు తీసుకుని తిరుగు ప్రయాణంలో మరో నలుగురం కలిసి బందరువెళ్లే రైలులో ఎక్కాం. మలకాపట్టణంలో రైలుదిగి ఎవరిదారిని వారు వెళ్తున్నాం. ఫర్లాంగు, రెండు ఫర్లాంగులు... ఒక కిలోమీటరు వరకు ఆ నిర్జన ప్రదేశంలో ఒంటరిగా నడచి వెళ్తున్నాను. ఇప్పటి భాస్కరపురమనే అప్పటి నక్కలతోటలోని మా అద్దె ఇంటికి రావలసిన దూరం నూట పది గజాలు మాత్రమే వుంటుంది. ఇంతలో ఎవరో వెనుకనుండి ''విష్ణుమూర్తిగారూ!'' అని పెద్దగా పిలిచారు. నేను వెనుకకు తిరిగి చూచేసరికి అల్లంత దూరాన ఏదో తెల్లటి ముసుగుతో కూడిన ఆకారం నావైపుకు నడుస్తూ వస్తున్నట్లు అనిపించింది నాకు. పరుగు లంఘించుకుని ఇంటికి చేరాను.

మిరపకాయలూ, వెంట్రుకలూ, ఉప్పు తెచ్చి దిష్టి తీయమని శ్రీమతిని ఆజ్ఞాపించాను. ఇంటిలోని వారంతా ఎంత గుచ్చి గుచ్చి అడిగినా చెమటలు కక్కుతున్న నేను అసలు విషయాన్ని బయట పెట్టలేదు.

ఉదయాన్నే లేచి ఒక కాగితం కలం పట్టుకున్నాను.

డియర్ దాసూ, నన్ను క్షమించు. వినాయకుడు పాలు త్రాగడం - సత్యసాయిబాబా గాలిలోనుండి గొలుసును తీయడం- దయ్యాలు మానవరూపం ధరించి మాట్లాడడం - ఏమిటో దాసూ! అంతా వింతగా వుంది. నక్కలతోట సమీపాన నీవు చెప్పిన దయ్యం గతరాత్రి నా వెంటకూడాపడి....? నేను రక్తం కక్కుకోవడంలేదుగాని నా కలం మాత్రం ఇప్పుడు చిక్కని రుధిరం లాంటి ఎర్రటి ఇంకును క్రక్కుతున్నది. ఒక్కసారి వచ్చి వెళ్లు.

ఇట్లు

మీ విష్ణుమూర్తి

వారం రోజులు తిరగకుండానే దాసువద్దనుండి నాకు రిప్లై వచ్చింది.

పిచ్చి విష్ణుమూర్తీ,

నేను చెప్పిన కథలన్నీకల్పితాలే! నిన్ను వెంటాడినది దయ్యం కాదు. కేవలం భయం అనే నీ 'గిలి' మాత్రమే.

ఇట్లు

దాసు

